సాక్షి
అనంతపురం

గురువారం । 20 । ఏప్రిల్ । 2023



ఔను.. అది హత్యే!

వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ వ్యక్తిని హతమార్చి.. ఆత్మహత్యగా చిత్రీకరించేయత్నం చేశారు.

8లో




చీనీ టన్ను రూ.35 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి.

గరిష్టం/కనిష్టం

43.9°/ 20.2°

జిల్లా అంతటా బుధవారం భానుడి భగభగ కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగాను నమోదయ్యాయి.



న్యూస్‌రీల్

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



సిబ్బందిని ఆరా తీస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పోలీస్ విధుల్లో సాంకేతికతను మరింత అందిపుచ్చుకోవాలని డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి, ఎస్పీ కె.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణంలోని పోలీసు కమాండ్ కంట్రోల్ విభాగాల్లో కీలకమైన ఈ సర్వేలెన్స్, టెక్నికల్, డయల్ 100, జిల్లా స్పెషల్ బ్రాంచి కార్యాలయాలను ఎస్పీతో కలిసి డీఐజీ తనిఖీ చేశారు. నేరాల నియంత్రణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన అనంత ఈగల్ ఐ, సైబర్ కవచ్ యాప్‌ల పనితీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఇ.నాగేంద్రుడు, ఎ.హనుమంతు, సీఐలు చక్రవర్తి, దేవానంద్, టెక్నికల్ విభాగం ఎస్ఐ సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రశాంతతకు భంగం కలగరాదు

తాడిపత్రి అర్బన్: అత్యంత సమస్యాత్మక ప్రాంతమైన తాడిపత్రిలో శాంతిభద్రతలు అదుపులో ఉంచాలని డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి పోలీసులను ఆదేశించారు. బుధవారం తాడిపత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌ను డీఐజీ సందర్శించారు. ఈ సందర్భంగా డీఎస్పీ చైతన్య, సీఐ చిన్న పెద్దయ్య, ఎస్ఐలు ధరణీబాబు, మహ్మద్ గౌస్‌తో సమీక్షించారు. మట్కాను పూర్తి స్థాయిలో నియంత్రించాలని డీఐజీ ఆదేశించారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో ప్రశాంత జీవనానికి భంగం వాటిల్లకుండా ఉండేందుకు పికెట్ ఏర్పాటు చేయాలని సూచించారు.

23న 5వ తరగతి, ఇంటర్ ప్రవేశ పరీక్ష



అనంతపురం రూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 23న కురుగుంట గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సునీత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 23న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 5వ తరగతి విద్యార్థులకు, ఇంటర్ ప్రవేశానికి మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి




మందులు పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

రాప్తాడు: హైరిస్క్ గర్భిణులను గుర్తించి మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ గౌతమి వైద్యాధికారులకు సూచించారు. బుధవారం రాప్తాడు పీహెచ్‌సీని ఆమె తనిఖీ చేశారు. ఇక్కడ ప్రసవాలు చేస్తున్నారా అని కలెక్టర్ ప్రశ్నించగా.. సాధారణ ప్రసవాలు ఇక్కడే చేస్తున్నామని, హైరిస్క్ కేసులను అనంతపురానికి రెఫర్ చేస్తున్నామని వైద్యాధికారి శ్రావణి సమాధానమిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, తహసీల్దార్ లక్ష్మీనరసింహ, ఎంపీడీఓ సాల్మన్ పాల్గొన్నారు.

ఫైళ్లు పెండింగ్ పెట్టకూడదు

అనంతపురం అర్బన్: ఫైళ్లను పెండింగ్ పెట్టకుండా నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి కలెక్టరేట్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లోని పలు విభాగాలను, ఖజానా, జిల్లా సరఫరాలు, సర్వే భూ రికార్డులు శాఖ కార్యాలయాలను సందర్శించారు.

'ముందస్తు' అడ్మిషన్లు వద్దు



రాప్తాడు రూరల్: బోర్డు నుంచి ఉత్తర్వులు వెలువడక ముందే ఇంటర్ అడ్మిషన్లు చేపడుతున్న ప్రైవేట్ కళాశాలల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఆర్ఐఓ సురేష్‌బాబు హెచ్చరించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఆరోగ్యం వెరీగుడ్డు

పేదల్లో పోషకాహార లోపాన్ని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆరేళ్లలోపు చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తోంది. ఇందులో ప్రధానంగా నాణ్యమైన కోడిగుడ్లను క్రమం తప్పకుండా పంపిణీ చేస్తోంది.

అనంతపురం వెంకటరావునగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కోడిగుడ్డు తింటున్న చిన్నారులు



- సంపూర్ణ పోషణపై జగన్ సర్కారు దృష్టి
- గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు లబ్ధి
- అంగన్‌వాడీల ద్వారా రోజుకు 1.59 లక్షల గుడ్లు
- పోషకాహార లోపం నియంత్రణకు నిత్యం పర్యవేక్షణ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పేదల ఆరోగ్యంపై జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. పోషకాహార లోపం నియంత్రణకు చర్యలు తీసుకుంటోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహార పంపిణీని సమర్థవంతంగా చేస్తోంది. ఇదివరకటిలా కాకుండా మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తోంది.

అత్యంత పోషక విలువలు కలిగిన కోడిగుడ్లను చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా చేరుస్తోంది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో చిన్నారుల ఆరోగ్యం కూడా ఒకటి. ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలు, మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంలో భాగంగా రోజుకు ఒక కోడిగుడ్డు నెలకు గరిష్ఠంగా 25 చొప్పున, చిన్నారులకైతే పాలు రోజుకు 100 మి.లీ చొప్పున నెలలో సగటున 25 రోజులకు 2.5 లీటర్లు, గర్భిణులు, బాలింతలకు రోజుకు 200 మి.లీ చొప్పున నెలకు 5 లీటర్లు అందిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అయితే గర్భిణులు, బాలింతలు, ప్రీస్కూల్ (3 నుంచి 6 సంవత్సరాల్లోపు) పిల్లలకు నెలకు సగటున 16 కోడిగుడ్లు, ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులకు 8 చొప్పున గుడ్లు ఇచ్చేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మాతాశిశు సంరక్షణకు పెద్దపీట వేసింది. పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు కోడిగుడ్లను నెలకు 25 ఇస్తోంది.

ఏడాదికి 4.78 కోట్ల గుడ్ల వినియోగం

జిల్లాలో 2,302 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలోని గర్భిణులు, బాలింతలు, ఏడు నెలల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 1,59,560 మంది ఉన్నారు. వీరందరికీ పోషకాహారంలో భాగంగా రోజుకు ఒక గుడ్డు చొప్పున నెలలో సగటున 25 రోజులకు 39,89,000 గుడ్లు అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్నారు. ఏడాదికి 4,78,68,000 కోడిగుడ్ల వినియోగం జరుగుతోంది. కోడిగుడ్లతో పాటు చిన్నారులకు బాలామృతం, మధ్యాహ్న భోజనం, పాలు, గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ కింద కిలో రాగిపిండి, బెల్లం, వేరుశనగ చిక్కీ, ఎండు ఖర్జూరం 250 గ్రాముల చొప్పున, సజ్జ/జొన్నతో పాటు అటుకులు కిలో చొప్పున అందిస్తున్నారు.

నాణ్యమైన పౌష్టికాహారం



అంగన్‌వాడీ కేంద్రం మధ్యాహ్న భోజనం మెనూలో సీఎం జగన్ తీసుకొచ్చిన మార్పులు మాలాంటి పేదలకు వరంగా మారింది. జగనన్న సంపూర్ణ పోషణ కిట్‌లో కిలో రాగి పిండి, కిలో జొన్న పిండి, కిలో అటుకులు, కాల్ కేజీ ఎండు ఖర్జూరం, కాల్ కేజీ చిక్కీ, 200 ఎంఎల్ పాలతో పాటు, మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు లాంటి నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నారు. – చందన, శాంతినగర్ బస్తీ, రాయదుర్గం

క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ



పాలు, గుడ్లు వంటివి ఇచ్చే రేషన్ కోటా ఈ ప్రభుత్వం భారీగా పెంచింది. కోడిగుడ్ల సరఫరాలో కొత్త నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది. పాల ప్యాకెట్లు మొదలుకొని నిత్యావసరాల వరకూ గోడౌన్‌కు రాగానే మొబైల్‌కు మెసేజ్ రావడం, ఆ తర్వాత వాటిని తీసుకురావడంపై సాంకేతికంగా నిఘా పెరిగింది. దీని వల్ల చిన్నారులు, బాలింతలు, గర్భిణుల పౌష్టికాహార సరఫరాలో లోపాలు దాదాపుగా సమసిపోయాయి. –శ్రీదేవి, ప్రాజెక్టు డైరెక్టర్, ఐసీడీఎస్

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కోడిగుడ్ల వినియోగం

కేటగిరీ	లబ్ధిదారుల సంఖ్య	నెలకు కోడిగుడ్లు
7నెలలు-3 ఏళ్ల మధ్య	82,680	20,67,000
3 - 6 ఏళ్ల మధ్య పిల్లలు	44,546	11,13,650
గర్భిణులు	16,044	4,01,100
బాలింతలు	16,290	4,07,250

పోషణ్ అభియాన్ ద్వారా కొత్త కార్యాచరణ..

- ప్రతి శుక్రవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు ఐసీడీఎస్ సిబ్బంది వెళ్లి న్యూట్రీషన్ కౌన్సెలింగ్ ఇవ్వడం
- హై రిస్క్ తల్లులకు ఐరన్ సుక్రోస్, ఎనీమియా వంటి ఇబ్బందులు లేకుండా ఆరోగ్యశాఖ సిబ్బందితో సమన్వయం చేసుకోవడం
- ప్రసవ సమయంలో గర్భిణులకు కోవిడ్ లక్షణాలున్నాయేమో పరిశీలించి వారికి ప్రత్యేక ఆహారాన్ని అందించడం
- ప్రతి బుధ, శనివారాల్లో చిన్నారులకు వంద శాతం టీకాలు వేయించేలా చూడటం
- ఆరేళ్లలోపు చిన్నారులందరికీ హిమోగ్లోబిన్ టెస్టులు చేయడం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనే ఇంటర్న్‌షిప్ 'స్పాట్'



మాట్లాడుతున్న ఎస్కేయూ వీసీ రామకృష్ణారెడ్డి

అనంతపురం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనే ఇంటర్న్‌షిప్ మూల్యాంకనం (స్పాట్) నిర్వహించాలని నిర్ణయించినట్లు ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఎస్కేయూలో వర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి వీసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన రీతిలో డిగ్రీ కోర్సుల్లో సమూల మార్పులు వచ్చాయన్నారు. డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ తప్పనిసరి అని అన్నారు. ఇంటర్న్‌షిప్‌కు సంబంధించి మొత్తం 200 మార్కులు కేటాయించగా, తక్కిన 150 మార్కుల్లో 100 మార్కులు ప్రాజెక్ట్ వర్క్‌కు, 50 మార్కులు వైవా వాయిస్‌కు కేటాయించామన్నారు. అయితే ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనే ఇంటర్న్‌షిప్ మూల్యాంకనం నిర్వహించాలన్నారు. ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ఇంటర్న్‌షిప్ మూల్యాంకనం నిర్వహించే అంశంపై వచ్చే ఏడాది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇంటర్న్‌షిప్ మూల్యాంకనానికి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, నోడల్ ఆఫీసర్, ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్ తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్‌లో రెండు, నాలుగు, ఐదు, ఆరో సెమిస్టర్ థియరీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ ఎ.మల్లికార్జునరెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

టమాట కిలో రూ.5

అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట ధర గరిష్ఠంగా రూ.5, కనిష్ఠంగా రూ.2.50, సరాసరిన రూ.3.50 పలికింది. మార్కెట్‌కు 10 టన్నుల టమాటాల క్రయవిక్రయాలు జరిగాయని మార్కెటింగ్ శాఖ ఏడీఎం పి.సత్యనారాయణచౌదరి, రాప్తాడు సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు.

పరివర్తనకు రంజాన్ దోహదం



ఇఫ్తార్ విందుకు హాజరైన ఎమ్మెల్యే అనంత, మాజీ ఎమ్మెల్యే విశ్వ, జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్



విందు ఆరగిస్తున్న ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే తదితరులు

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- మతసామరస్యానికి ప్రతీకలు పండుగలు
- సీఎం జగన్ ముస్లింల పక్షపాతి
- శాంతియుత వాతావరణంలో రంజాన్ జరుపుకోవాలి : ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం సప్తగిరి సర్కిల్: రంజాన్ మాసం పరివర్తనకు దోహదం చేస్తుందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జిల్లా స్థాయి ఇఫ్తార్ విందును స్థానిక పోలీస్ కాంప్లెక్స్‌లో నిర్వహించారు. ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, కలెక్టర్ ఎం.గౌతమి, ఎస్పీ శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ విభిన్న మతాలు, కులాలు, సంస్కృతులు, ఆచార వ్యవహారాలు మన దేశంలో ఉన్నాయన్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచేందుకు ఇలాంటి పండుగలను సామూహికంగా నిర్వహించి ఐక్యత చాటుకుంటున్నామన్నారు. సీఎం జగన్ ముస్లింల పక్షపాతి అని కొనియాడారు. ఆనాడు వైఎస్సార్ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించి అన్ని విధాలా ఆదుకున్నారన్నారు. నేడు సీఎం జగన్ ఉర్దూను రెండో అధికార భాషగా చేశారన్నారు. మైనార్టీలకు ప్రత్యేక సబ్‌ప్లాన్ అమలు చేస్తున్నారన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్త మానవాళికి రంజాన్ మాసం ఆదర్శమన్నారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రంజాన్ వేడుకలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, అహుడా చైర్మన్ మహలక్ష్మి శ్రీనివాస్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి మొహమ్మద్ రఫి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన



పాలవాయిలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న విదేశీ బృందం సభ్యులు

కళ్యాణదుర్గం: మండలంలోని పాలవాయి, భట్టువానిపల్లి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన వేరుశనగ, మిరప తదితర పంటలను బుధవారం రిటైర్డ్ ఐఏఎస్ టి.విజయ్‌కుమార్ నేతృత్వంలో ఫ్రాన్స్‌కు చెందిన మోనిక్ ట్రాన్, మాలిశ్రీ దగర్, అమెరికాకు చెందిన మాక్స్ కూపర్, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మానాయక్ బృందం పరిశీలించింది. సాగు పద్ధతుల గురించి రైతులు తమ అనుభవాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, విత్తన గుళికల తయారీ గురించి ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మానాయక్ రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం కనకదుర్గ గ్రామ సంఘం సభ్యులతో ప్రకృతి వ్యవసాయంలో పాటిస్తున్న పద్ధతులు, వారి అనుభవాలను విదేశీయుల బృందం అడిగి తెలుసుకుంది. కార్యక్రమంలో ఏఓ ప్రవీణ్‌కుమార్, ఎస్ఆర్‌పీ నరేంద్రకుమార్, జిల్లా కో ఆర్డినేటర్ భానుమతి, డివిజన్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎంటీ శివశంకర్, మహిళా సంఘాల లీడర్లు, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

నేడు అధికారుల పర్యటన

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తున్న రైతుల పొలాలను సందర్శించడానికి రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్, పంచాయతీ రాజ్ శాఖ, రూరల్ డెవలప్‌మెంట్ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం కళ్యాణదుర్గం మండలం పాలవాయి, మల్లాపురం గ్రామాల్లో పర్యటించనున్నట్లు డీపీఎం లక్ష్మానాయక్ తెలిపారు.

సైనిక కాలనీల్లో తక్కువ ధరకే ఇళ్ల స్థలాలు



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: మాజీ సైనికులు, వారి కుటుంబాల్లోని వితంతువులకు 175 చదరపు గజాల విస్తీర్ణంతో ఇళ్ల స్థలాలను ప్రభుత్వ ధరకు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సైనిక కాలనీలు ఏర్పాటు చేస్తోంది. ఈ మేరకు సైనిక్ సంచాలకుల నుంచి ఆదేశాలు అందాయని ఉమ్మడి అనంతపురం జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసులు తెలిపారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని ఆసక్తి కలిగిన మాజీ సైనిక కుటుంబాల వారు ఇళ్ల స్థలాల కోసం ఈ నెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పదో తరగతి మూల్యాంకనం ప్రారంభం

- తొలిరోజు మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన 'స్పాట్'
- ఆర్డర్లు రద్దు చేయించుకునేందుకు టీచర్ల తిప్పలు
- అనారోగ్య సమస్యలుంటేనే రద్దుకు అనుమతి



తల్లి 'మూల్యాంకన' విధుల్లో పాల్గొనగా.. పిల్లలు బయట హోం వర్క్ చేసుకుంటున్న దృశ్యం



జవాబు పత్రాలను మూల్యాంకనం చేస్తున్న ఉపాధ్యాయులు

రాప్తాడురూరల్: అనంతపురంలోని కేఎస్ఆర్ బాలికల పాఠశాల కేంద్రంలో పదోతరగతి జవాబు పత్రాల మూల్యాంకనం బుధవారం ప్రారంభమైంది. ఏఈలుగా నియమించిన పలువురు టీచర్లు ఉత్తర్వులు రద్దు చేయించుకునేందుకు తంటాలు పడ్డారు. మరికొందరు విధుల్లో చేరేందుకు క్యూ కట్టారు. అన్నింటినీ సర్దుబాటు చేసిన అధికారులు ఎట్టకేలకు మధ్యాహ్నం 3 గంటల నుంచి మూల్యాంకనం ప్రారంభించారు. తొలిరోజు ఒక్కో ఏఈ 20 పేపర్లు దిద్దారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన మేరకు ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. తాగునీరు, లైటింగ్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచారు. క్యాంపు ఆఫీసరు, జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరామ్, డిప్యూటీ క్యాంపు ఆఫీసర్లు శంకరప్రసాద్ (అడ్మినిస్ట్రేషన్), గోవిందునాయక్ (స్ట్రాంగ్‌రూం) పర్యవేక్షించారు. జిల్లాకు మొత్తం 2 లక్షల జవాబుపత్రాలు వచ్చాయి.

గైర్హాజరైన స్పెషల్ అసిస్టెంట్లపై చర్యలు

మూల్యాంకనానికి మొత్తం 250 మంది టీచర్లను స్పెషల్ అసిస్టెంట్లుగా నియమించారు. వీరిలో 194 మంది విధుల్లో చేరారు. తక్కిన వారు సాయంత్రమైనా చేరలేదు. సంబంధిత హెచ్ఎంలు రిలీవ్ చేసి వారు జాయిన్‌కాకపోతే వారందరినీ సస్పెండ్ చేస్తామని డీఈఓ తెలిపారు. రిలీవ్ చేయకపోతే హెచ్ఎంలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. తెలుగు సబ్జెక్టుకు 123 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, హిందీకి 94 మంది, గణితం 129 మంది, ఫిజికల్ సైన్స్ 125 మంది, బయలాజికల్ సైన్స్ 125 మంది, సోషల్ 90 మంది జాయిన్ అయ్యారు. అయితే ఇంగ్లిష్‌కు 197 మంది చేరినా ఇంకా 50 మంది అవసరం ఉన్న నేపథ్యంలో మోడల్ స్కూళ్లకు సమాచారం అందించారు. వారిలో అనుభవమున్నవారిని నియమిస్తామని డీఈఓ తెలిపారు.

మొబైల్‌ఫోన్లకు అనుమతి లేదు

విద్యార్థుల జీవితాలతో ముడిపడిన మూల్యాంకనం విషయంలో ఎవరూ నిర్లక్ష్యం చేయొద్దని డీఈఓ సాయిరామ్ సూచించారు. మూల్యాంకనం క్యాంపులో మొబైల్‌ఫోన్లకు అనుమతి లేదని, ఎవరైనా మొబైల్ మాట్లాడుతూ పేపర్లు దిద్దితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధ్యత లేకపోతే ఎలా?

పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు డీఈఓను కలిసి ఏఈ ఉత్తర్వులను రద్దు చేయాలంటూ కోరారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ నిజంగా అనారోగ్య సమస్యలు ఉన్న వారిని ఎందుకు ఇబ్బంది పెడతాం.. అలాంటి వారిని మినహాయిస్తామని అన్నారు. ఆరోగ్యం బాగున్న వారు కూడా విధులకు రాలేమంటే ఎలా అని మండిపడ్డారు. ఇన్నేళ్లు పిల్లలకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు ఆ పిల్లలు రాసిన పరీక్ష పేపర్లను దిద్దే విషయంలో ఇలా వ్యవహరిస్తే ఎలా? బాధ్యత ఉండాలి కదా? అని అసహనం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

చెరకు తోట దగ్ధం



అగ్నిప్రమాదంలో కాలిపోయిన చెరకు తోట

కంబదూరు: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో కోత దశలో ఉన్న చెరకు తోట దగ్ధమైంది. బాధితుడు తెలిపిన మేరకు... కంబదూరు మండలం అయ్యంపల్లికి చెందిన రైతు బెస్త దశమోహన్... తనకున్న రెండు ఎకరాల్లో చెరకు తోటను అభివృద్ధి చేశాడు. పంట ఏపుగా పెరిగి కోత దశకు వచ్చింది. రేపో మాపో పంటను కోసి, మార్కెట్‌కు తరలించాలనుకున్నాడు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో చెరకు తోట కాలిపోయింది. ఘటనతో రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

టీచర్ ఖాతా నుంచి నగదు మాయం

గుత్తి: మండలంలోని అబ్బేదొడ్డి ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు సుశీలాపద్మావతి బ్యాంక్ ఖాతా నుంచి రూ.30 నగదు మాయమైంది. గుత్తిలోని ఉప్పరవీధిలో నివాసముంటున్న ఆమెకు స్థానిక ఎస్‌బీఐ శాఖలో ఖాతా ఉంది. ఈ నెల 15, 16, 18వ తేదీల్లో వరుసగా రూ. 10 వేలు చొప్పున రూ. 30 వేలు ఆమె ఖాతా నుంచి మరో ఖాతాకు బదిలీ అయింది. ఘటనకు సంబంధించి బుధవారం పోలీసులకు, బ్యాంక్ అధికారులకు ఆమె ఫిర్యాదు చేశారు.

సిరిధాన్యాల సాగుకు చర్యలు : కలెక్టర్



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

అనంతపురం అర్బన్: జిల్లాలో సిరిధాన్యాల సాగు పెంచే దిశగా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ ఎం.గౌతమి స్పష్టం చేశారు. సిరిధాన్యాల ఆహారంతో రోగాలను నయం చేసుకోవడంపై ఈ నెల 28న స్వచ్ఛంద సంస్థలు తలపెట్టిన అవగాహన సదస్సుకు సంబంధించిన పోస్టర్లను బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆమె ఆవిష్కరించి, మాట్లాడారు. 2023ను అంతర్జాతీయ సిరిధాన్యాల సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిన నేపథ్యంలో సిరిధాన్యాల సాగు పెంచేందుకు కార్యాచరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదరణ రామకృష్ణ, విశ్రాంత డీటీ లక్ష్మీనారాయణ, సెరా అధ్యక్షుడు కుళ్లాయిస్వామి, ఎస్‌ఐఆర్డీ విశ్రాంత ప్రొఫెసర్ గంగిరెడ్డి పాల్గొన్నారు.

ఔను.. అది హత్యే!

- హతుడు జొన్నగిరి వాసి శంకర్‌నాయక్
- రైలుపట్టాలపై వేసి ఆత్మహత్యగా చిత్రీకరించేయత్నం
- గొంత కోసి హతమార్చిన వైనం
- వివాహేతర సంబంధం, వడ్డీ వ్యాపారమే కారణం

పామిడి: ఈ నెల 10న స్థానిక రైలు పట్టాలపై వ్యక్తి మొండెం లభ్యమైన కేసులో మిస్టరీ వీడింది. ఇది ఆత్మహత్య కాదని, హత్యగా పోలీసులు నిర్ధారించారు. ఇందుకు సంబంధించి ఇద్దరిని పామిడి సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, గుత్తి రైల్వే పోలీసులు సంయుక్తంగా విచారణ చేస్తున్నారు.

ఏం జరిగింది?

ఈ నెల 10వ తేదీన పామిడిలోని ఎద్దులపల్లి రోడ్డు రైల్వేగేట్ ఎల్‌సీ 143 సమీపంలో ఓ వ్యక్తి మొండెం లభ్యమైంది. తల లేదు. మృతదేహం పడి ఉన్న తీరును బట్టి హత్యగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి కింద గుత్తి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. పామిడి సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, గుంతకల్లు రైల్వే సీఐ నగేష్‌బాబు నేతృత్వంలో ముమ్మర దర్యాప్తు సాగించిన జీఆర్పీ సిబ్బంది.. ఈ కేసులో మిస్టరీని ఛేదించారు.

హతుడు ఎవరు?

తొలుత పట్టాలపై తలలేని మొండెం లభ్యం కావడంతో ఈ కేసు దర్యాప్తు రైల్వే పోలీసులకు పెను సవాల్‌గా మారింది. జీఆర్పీ సీఐ నగేష్‌బాబు ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు కొనసాగించారు. మొండాన్ని కొద్ది దూరం వరకూ లాక్కొచ్చి అక్కడ పడేసినట్లుగా ఆనవాళ్లను పోలీసులు గుర్తించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో తొలుత గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి... దర్యాప్తులో కర్నూలు జిల్లా జొన్నగిరికి చెందిన శంకర్ నాయక్‌గా నిర్ధారించారు.



రైలు పట్టాలపై పడి ఉన్న శంకర్‌నాయక్ మృతదేహం (ఫైల్)

ఎందుకు హతమార్చారు?

శంకర్‌నాయక్ వడ్డీ వ్యాపారం సాగించేవాడిగా తెలుస్తోంది. ఈ క్రమంలో వడ్డీకి ఇచ్చిన డబ్బు తిరిగి చెల్లించని ఓ మహిళను లోబర్చుకుని తన శారీరక అవసరాలు తీర్చుకునేవాడు. ఈ విషయం శంకర్‌నాయక్ భార్యకు తెలిసి గొడవ చేయడంతో సదరు మహిళ తన పుట్టింటికి చేరుకుంది. అయినా శంకర్‌నాయక్ ఆమెను డబ్బు కోసం వేధిస్తూ వచ్చాడు. ఇదే అతని హత్యకు దారి తీసింది.

ఎలా చేశారు?

పామిడి మండలం రామగిరి గ్రామానికి చెందిన మంగల నారాయణ, నారాయణమ్మ దంపతుల రెండో కుమార్తె రాజేశ్వరి అలియాస్ రాజీని పదేళ్ల క్రితం జొన్నగిరికి చెందిన కేశవయ్యకు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. మూడేళ్ల క్రితం కరోనా కారణంగా కేశవయ్య మృతి చెందాడు. ఆ సమయంలో కుటుంబ పోషణ భారం కావడంతో శంకర్‌నాయక్ వద్ద లక్ష రూపాయలను అప్పుగా రాజీ తీసుకుంది. ఈ అప్పు వసూలు చేసుకునే క్రమంలో ఆమెను శంకర్ నాయక్ లోబర్చుకుని శారీరక అవసరాలు తీర్చుకునేవాడు. ఏడాది క్రితం ఈ విషయం తెలుసుకున్న శంకర్‌నాయక్ కుటుంబసభ్యులు నిలదీయడంతో రాజీ ఆ గ్రామాన్ని విడిచి పుట్టింటికి చేరుకుని, వితంతువైన తన తల్లితో కలసి జీవిస్తోంది. అయితే అప్పు పేరుతో ఆమెను శంకర్‌నాయక్ వెన్నాడడం వీడలేదు. తరచూ రామగిరికి వచ్చి రాజీని కలసి డబ్బు గురించి నిలదీస్తూ తన అవసరాలు తీర్చుకుని వెళ్లేవాడు. చివరకు శంకర్‌నాయక్ వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో ఎలాగైనా అతన్ని అడ్డుతొలగించుకోవాలని రాజీ, ఆమె తల్లి భావించారు. బాకీ డబ్బు ఇస్తామంటూ నమ్మించి శంకర్‌నాయక్‌ను రామగిరికి రప్పించిన రాజీ.. అనంతరం తన తల్లి నారాయణమ్మ సాయంతో ఈలకత్తి, కత్తులతో శంకర్‌నాయక్ గొంతుకోసి హతమార్చింది. అనంతరం మృతదేహాన్ని తీసుకువచ్చి పట్టాలపై పడేసి వెళ్లారు. పక్కా ఆధారాలతో నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేస్తున్నారు. అయితే శంకర్ నాయక్ తల ఎక్కడుందనేది స్పష్టత రాలేదు. గొంతు కోసిన తర్వాత తల కొంచెం మొండెనికి అతుక్కొని ఉండగానే రైలు పట్టాలపై పడేసినట్లు పోలీసుల విచారణలో రాజీ తెలిపినట్లు సమాచారం. మాయమైన తల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి



మృతురాలు సుబ్బమ్మ

తాడిపత్రి: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి మండలం ఆలూరుకు చెందిన తేరుకాటి తలారి సుబ్బమ్మ (64) మంగళవారం రాత్రి తన కుమారుడి ఇంటి వద్ద నిద్రించింది. బుధవారం ఉదయం నిద్ర లేచి తన ఇంటికి వెళుతూ మార్గమధ్యంలో సుబ్బరాయుడి ఇంటికి వేసిన ఫెన్సింగ్‌ను పట్టుకుని నడిచేందుకు ప్రయత్నించింది. అయితే అప్పటికే కరెంట్ లైన్ తెగి ఫెన్సింగ్‌పై పడి విద్యుత్ ప్రసారం జరుగుతుండడంతో ఒక్కసారిగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందిని అప్రమత్తం చేసి కరెంట్ సరఫరాను నిలుపుదల చేయించారు. సమాచారం అందుకున్న తాడిపత్రి రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలి కుమారుడు ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆదాయ వనరులపై దృష్టి పెట్టండి

అనంతపురం సిటీ: మండలాలు, పంచాయతీల్లో ఆదాయ వనరులపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులను జిల్లా పరిషత్ సీఈఓ భాస్కర రెడ్డి ఆదేశించారు. డీఎల్‌డీఓలు చిలంకూరు ఓబుళమ్మ (అనంతపురం), సూర్యనారాయణ(కదిరి), శంకర్ (కళ్యాణదుర్గం), శివారెడ్డి (ధర్మవరం)తో పాటు 63 మండలాల ఎంపీడీఓలు, ఈఓఆర్డీలతో టెలీకాన్ఫరెన్స్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన పక్కన డిప్యూటీ సీఈఓ అమృతరాజ్ ఉన్నారు. .జిల్లా పరిషత్, మండల పరిషత్ ఆస్తులతో పాటు ఆడిట్, ఎన్నికలు వంటి కీలక అంశాలపై చర్చించారు.

రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత లోపించరాదు

- పంచాయతీరాజ్ ఎస్ఈ భాగ్యరాజ్

అనంతపురం సిటీ: రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత లోపించరాదని పంచాయతీ రాజ్ ఇంజినీర్లను ఆ శాఖ ఎస్ఈ భాగ్యరాజ్ ఆదేశించారు. అనంతపురంలోని పీఆర్ జిల్లా కార్యాలయ సమావేశ భవన్‌లో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐఐబీ, పీఆర్, రూరల్ రోడ్స్ స్కీంల కింద ఉమ్మడి జిల్లాలో మొత్తం రూ.268 కోట్లతో 138 రోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. వాటిలో ఇప్పటికే 10 రోడ్లు పూర్తి కాగా, 128 రోడ్లు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. అందుకు రూ.64.43 కోట్లు ఖర్చు అయినట్లు తెలిపారు. అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ కింద రూ.35.43 కోట్లతో 65 రోడ్లు మంజూరు కాగా, ఇప్పటికే రూ.7.86 కోట్లతో 16 రోడ్లు పూర్తయ్యాయన్నారు. మిగిలిన రోడ్ల నిర్మాణాలను వివిధ దశల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం(పీఎంజీఎస్‌వై) కింద రూ.70.62 కోట్లతో 2 పనులు మంజూరు కాగా, రూ.56.36 కోట్ల ఖర్చుతో 15 రోడ్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. రహదారుల నిర్మాణాల్లో నాణ్యతను విస్మరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కేవీకేవీ ప్రసాద్(అనంతపురం), డీఎల్ శ్రీనివాసులు(శ్రీసత్యసాయి జిల్లా), డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

పాముకాటుకు బాలుడు బలి

- ఆస్పత్రి బయట ఆడుకుంటుండగా కాటేసిన పాము
- చికిత్స పొందుతూ బాలుడి మృతి



పాముకాటుతో మృతి చెందిన మదన్‌కుమార్

తనకల్లు: స్థానిక 30 పడకల ప్రభుత్వాస్పత్రి ఆవరణలో పాముకాటుకు గురై మదన్‌కుమార్ (4) అనే బాలుడు మృత్యువాత పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నల్లచెరువు ఎస్సీ కాలనీకి చెందిన శంకర్ రెండు రోజుల క్రితం తన భార్య సుమిత్రను కాన్పు కోసం తనకల్లులోని 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చాడు. బుధవారం ఉదయం తన భార్యను చూసేందుకు శంకర్ తన నాలుగేళ్ల కుమారుడైన మదన్‌కుమార్‌ను తీసుకొని ఆస్పత్రికి వచ్చాడు. భార్య సుమిత్రతో మాట్లాడిన అనంతరం కుమారుడితో కలిసి ఆస్పత్రి బయటకు వచ్చి బంధువులతో మాట్లాడుతుండగా, మదన్‌కుమార్ ఆడుకుంటూ కుళాయి వద్దకు వెళ్లాడు. నీరు బయటకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన పైప్‌లోకి చెయ్యి పెట్టాడు. ఆ పైప్‌లో ఉన్న నాగుపాము బాలుడి చేతిపై కాటు వేసింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే వైద్యుల దగ్గరకు తీసుకెళ్లారు. నోటి నుంచి నురగ వస్తుండటంతో పాముకాటు వేసినట్లు గుర్తించిన వైద్యులు బాలుడి ప్రాణాలు కాపాడేందుకు శతవిధాలా ప్రయత్నించారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో మదన్‌కుమార్ మృతి చెందాడు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కుమారుడు పాముకాటుతో కళ్లముందే ప్రాణాలు వదలడంతో శంకర్, సుమిత్ర దంపతులు కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాంభూపాల్, ఏఎస్ఐ నరసింహులు ఆస్పత్రి వద్దకు వచ్చి బాలుడి మృతిపై విచారణ చేశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కదిరి ఆస్పత్రికి తరలించారు.

జడ్జీల బదిలీలు

అనంతపురం: జిల్లా జడ్జిల బదిలీలు జరిగాయి. అనంతపురం ఫ్యామిలీ కోర్టు -7 అడిషనల్ జిల్లా జడ్జి, సెషన్స్ జడ్జి డి.తిరుమలరావును గుంటూరు లేబర్ కోర్టు, చైర్మన్ ఇండస్ట్రీయల్ ట్రిబ్యునల్‌గా బదిలీ చేశారు. తన బాధ్యతలను ఆయన నాలుగో అదనపు జిల్లా జడ్జి, స్పెషల్ కోర్టు ఫర్ ట్రయిల్ ఆఫ్ అఫెన్స్ అగనెస్ట్ ఉమెన్, అనంతపురానికి అప్పగించాలి. మొదటి అడిషనల్ జడ్జి ఎస్. రమేష్‌ను చిత్తూరు మొదటి అడిషనల్ జడ్జిగా బదిలీ చేశారు. వీరు అనంతపురం లేబర్ కోర్టు చైర్మన్‌కు బాధ్యతలు అప్పగించి, రిలీవ్ కావాలి. నాల్గో అడిషనల్ జిల్లా జడ్జి కబర్దీని నెల్లూరు ఒకటో అడిషనల్ జిల్లా జడ్జిగా బదిలీ చేశారు. వీరు కూడా తమ బాధ్యతలను స్పెషల్ జడ్జి(పోక్సో)కి అప్పగించాలి. అలాగే కదిరి సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకటేశ్వర రావును విశాఖపట్నం రెండో అడిషనల్ సివిల్ జడ్జిగా, శ్రీకాకుళం జిల్లా టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి టి.హరితను గుత్తి సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు.

టీడీపీ నాయకుడిపై కేసు నమోదు

కొత్తచెరువు: పొలానికి వేసిన కంచెను ధ్వంసం చేసిన ఘటనకు సంబంధించి టీడీపీ నాయకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలను కొత్తచెరువు ఎస్ఐ లింగన్న బుధవారం వెల్లడించారు. కొత్తచెరువు గ్రామానికి చెందిన ఇంజెం మురళికి పెనుకొండ రహదారిలోని తిప్పాబట్లపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే 71/1లో 14.16 ఎకరాల పొలం ఉంది. తన పొలం చుట్టూ రాళ్ల పాతి కంచెను ఏర్పాటు చేశాడు. అయితే ఈ పొలానికి సంబంధించి తాము కూడా అగ్రిమెంట్ చేసుకున్నామని దౌర్జన్యంగా టీడీపీ నాయకుడు సాలక్కగారి శ్రీనివాసులు, అనుచరుడు మాయల సాయి ఈ నెల 15న కంచెను ధ్వంసం చేశారు. దీనిపై బాధిత రైతు మురళి ఫిర్యాదు మేరకు శ్రీనివాసులు, సాయిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలల్లో 257 మందికి ఉచిత ప్రవేశాలు

రాప్తాడు రూరల్: ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం 12(1)(సి) కింద 2023-24 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో 257 మంది విద్యార్థులకు ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలు కల్పించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను బుధవారం ఆయన విడుదల చేశారు. విద్యార్థులకు కేటాయించిన పాఠశాలల వివరాలు మండల విద్యాశాఖ అధికారులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు పంపినట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 19 నుంచి 25వ తేదీలోపు ఆయా పాఠశాలల్లో ప్రవేశాలు పొందాలని సూచించారు.

కసాపురం ఆంజనేయస్వామి ఆలయ పాలక వర్గం ఏర్పాటు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయ పాలకవర్గాన్ని నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల పాటు కొనసాగే పాలక వర్గంలో చైర్మన్‌గా అనువంశిక ధర్మకర్త కె.సుగుణమ్మ వ్యవహరించనున్నారు. సభ్యులుగా టీవీ లోక్‌నాథశర్మ, మంతాజీ త్యాగరాజు, పాటిల్ మల్లికార్జునరెడ్డి, గనపర సరోజ, గుంత రమేష్‌బాబు, శోభాశారద, గోపా వెంకటేశులు, పాటిల్ రాధిక, గంతుల లక్ష్మి, గంతుల రామక్రిష్ణమ్మ నియమితులయ్యారు. ఎక్స్అఫీషియో సభ్యుడిగా ఆలయ ప్రధాన అర్చకుడు గరుడాచార్యులు కొనసాగనున్నారు. భక్తుల సమస్యలు పరిష్కరించడంతోపాటు, ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన గత పాలకవర్గం సభ్యులనే మరోసారి కొనసాగించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డికి ఈసందర్భంగా పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బాలిక ఆచూకీ తెలపండి



శిల్ప (ఫైల్)

శింగనమల: మండలంలోని కల్లుమడి గ్రామానికి చెందిన డి.శిల్ప ఈ నెల 18వ తేదీ నుంచి కనిపించడం లేదు. ఈ మేరకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 93460 10558, 93460 10580కు సమాచారం అందించాలని కోరారు.

'మిరప రైతులను ఆదుకోండి'

అనంతపురం అర్బన్: గిట్టుబాటు ధర కల్పించడం ద్వారా మిరప రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ విన్నవించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో దాదాపు 20 వేల ఎకరాల్లో మిరప పంట సాగు చేశారన్నారు. గత నెల బ్యాడిగి మిరప క్వింటా ధర రూ.27 వేలు ఉండగా ప్రస్తుతం రూ.17 వేలకు మించి అడగడం లేదన్నారు. వారం రోజుల వ్యవధిలో క్వింటా ధర రూ.10వేలు తగ్గిందన్నారు. దళారులు ఇష్టారాజ్యంగా ధరను తగ్గించి రైతులను దోచుకుంటున్నారని, ఈ దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరతో మిరప పంటను కొనుగోలు చేయాలన్నారు.

తోటల్లో అగ్గి పడితే పరిహారం వర్తించదు

- ఉద్యానశాఖ అధికారి రఘునాథరెడ్డి సూచన

అనంతపురం అగ్రికల్చర్: అగ్నిప్రమాదాల వల్ల పండ్లతోటలు దెబ్బతింటే రైతులకు ఎలాంటి పరిహారం వర్తించదని ఉద్యాన రైతులను ఆ శాఖ జిల్లా అధికారి బి.రఘునాథరెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న ప్రస్తుత రోజుల్లో అగ్నిప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. తోటల్లో కలుపు, ఎండుటాకులు, ఇతర గడ్డి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తోట చుట్టూ కంచెను, పరిసర పంట పొలాలను జాగ్రత్తగా గమనిస్తుండాలన్నారు. ఫారంపాండ్లు, కుంటల్లో నీటిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రమాదం చోటు చేసుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక శాఖతో పాటు ఉద్యాన, రెవెన్యూ అధికారులకూ సమాచారం అందించాలని సూచించారు.

21 నుంచి రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు

ధర్మవరం రూరల్: హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకూ ధర్మవరంలో సీనియర్ పురుషుల హాకీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ జిల్లా కార్యదర్శి బంధనాథం సూర్యప్రకాష్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు. వివిధ జిల్లాల నుంచి తరలివచ్చే క్రీడాకారులు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

వేటగాళ్ల ఉచ్చుకు బలి

- గత ఏడాది కనిపించకుండా పోయిన రైతు
- విద్యుత్ షాక్‌తో మృతి చెందితే గుట్టుచప్పుడు కాకుండా ఖననం
- హత్య కేసు కింద నిందితుల అరెస్ట్



మృతుడు షేక్ బాబ్జాన్

హిందూపురం: ఏడాది క్రితం కనిపించకుండా పోయిన వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందితే గుట్టుచప్పుడు కాకుండా పాతిపెట్టినట్లు పోలీసులు పసిగట్టారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను హిందూపురం అప్‌గ్రేడ్ రూరల్ సీఐ కృష్ణారెడ్డి బుధవారం వెల్లడించారు. హిందూపురం మండలం చలివెందులకు చెందిన షేక్ బాబ్జాన్, రజియా దంపతులు. వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్నారు. గత ఏడాది జనవరి 26న పొలం పనుల ముగించుకుని సాయంత్రం ఇంటికి బయల్దేరిన బాబ్జాన్ (45)... అదే గ్రామానికి చెందిన రైతు ముర్తప్ప పొలం వద్ద అడవి పందుల వేటగాళ్లు చాకలి కిష్టప్ప, గొల్ల శ్రీరాములు, కిష్టప్ప అక్రమంగా వేసిన కరెంటు తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కాసేపటి తర్వాత అడవి పందులు పడ్డాయోమోనని చూసేందుకు అటుగా చేరుకున్న వేటగాళ్లు... బాబ్జాన్ మృతదేహాన్ని చూసి భయపడ్డారు. ఈ విషయం వెలుగు చూస్తే ఆ నేరం తమ మీదకు వస్తుందనే అపోహతో ఎవరికీ చెప్పకుండా ఆటో డ్రైవర్ నరేష్‌ను రప్పించుకుని, అతని ఆటోలో బాబ్జాన్ మృతదేహాన్ని హంద్రీనీవా కాలువ వద్దకు తరలించి, పాతిపెట్టారు. కాగా, తన భర్త కనిపించకుండా పోవడంతో రజియా పలు ప్రాంతాల్లో గాలించింది. ఆచూకీ లభ్యం కాకపోవడంతో అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు అప్పటి నుంచి బాబ్జాన్ ఆచూకీ కోసం ఆరా తీస్తూ ఉన్నారు. ఈ క్రమంలో రెండ్రోజుల క్రితం శ్రీరాములు ఫుల్‌గా మద్యం తాగి మత్తులో బాబ్జాన్ చనిపోయాడని, హంద్రీనీవా కాలువ వద్ద పాతిపెట్టినట్లు నోరు జారాడు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో శ్రీరాములును బుధవారం అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. దీంతో మిగిలిన ఇద్దరు వేటగాళ్లనూ అదుపులోకి తీసుకున్నారు. బుధవారం రాత్రికి ఆటో డ్రైవర్‌ను సైతం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నిందితులపై హత్య కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణారెడ్డి తెలిపారు.

పీఎం శ్రీ పథకానికి 'ఏపీఆర్ఎస్ఈ'



కొడిగెనహళ్లిలోని ఏపీ గురుకుల ప్రతిభావంతుల బాలుర పాఠశాల

పరిగి: ప్రభుత్వ బడులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర విద్యాశాఖ అమలుచేస్తున్న 'పీఎం శ్రీ స్కూల్స్' పథకానికి పరిగి మండలం కొడిగెనహళ్లిలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల ప్రతిభావంతుల బాలుర పాఠశాల (ఏపీఆర్ఎస్ఈ) ఎంపికైంది. ఈ మేరకు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్వీ మురళీధర్ బాబు బుధవారం వెల్లడించారు. జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా దేశీయంగా విద్యారంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన కేంద్ర ప్రభుత్వం... ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం ఎస్‌హెచ్‌ఆర్ఐ - పీఎం శ్రీ) పేరుతో దేశ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. అత్యాధునిక హంగులు, సాంకేతికతను జోడించి డిజిటలైజేషన్‌తో నాణ్యమైన విద్యాబోధన అందించే దిశగా చేపట్టిన ఈ పథకానికి దేశ వ్యాప్తంగా 14,500 పాఠశాలలను తొలిదశలో ఎంపిక చేశారు. ఇందులో ఏపీలోని 662 పాఠశాలలు ఉండగా కొడిగెనహళ్లిలోని ఏపీఆర్ఎస్ఈకు చోటు దక్కడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ ఎంపికకు సహకరించిన సమగ్ర శిక్ష డిప్యూటీ డైరెక్టర్ శ్రీను ప్రకాష్, గురుకుల సొసైటీ కార్యదర్శి నరసింహారావు, డీఈఓ మీనాక్షి, ఏఎంఓ మహేందర్‌రెడ్డి, ఎంఈఓ లక్ష్మీదేవికి ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికుల భద్రతకు తొలి ప్రాధాన్యత

- కియా సీఏఓ కబ్డాంగ్ లీ



విపత్కర పరిస్థితుల్లో స్పందించాల్సిన తీరుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: కియా పరిశ్రమలో కార్మికుల భద్రతకు తొలి ప్రాధాన్యతనిస్తున్నట్లు ఆ పరిశ్రమ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (సీఏఓ) కబ్డాంగ్ లీ స్పష్టం చేశారు. పరిశ్రమలో నూతనంగా ఏర్పాటు చేసిన భద్రత అనుభవ శిక్షణా కేంద్రాన్ని ఫ్యాక్టరీస్ డైరెక్టర్ డి.చంద్రశేఖరవర్మ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖరవర్మ మాట్లాడుతూ.. భద్రత అనుభవ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన కియా యాజమాన్యాన్ని అభినందించారు. రాష్ట్రంలోనే ఈ అభ్యసన కేంద్రం మొట్టమొదటిదని గుర్తు చేశారు. ఇతర పరిశ్రమల్లోనూ ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటే ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించవచ్చునన్నారు. కియా ఎండీ తే జిన్ పార్క్ మాట్లాడుతూ.. భద్రతా అనుభవ శిక్షణా కేంద్రంలో పరిశ్రమలోని చిన్న ఉద్యోగి మొదలు ఉన్నస్థాయి అధికారి వరకూ ప్రతి ఒక్కరికీ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కేశవులు, కార్మికులు పాల్గొన్నారు.

ఫీజు లక్ష్యాలు సాధించాలి

- మార్కెటింగ్‌శాఖ ఏడీ సత్యనారాయణచౌదరి

అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత (2023-24) ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత ఫీజు వసూళ్ల లక్ష్యాన్ని సాధించి తీరాలని సంబంధిత సిబ్బందిని మార్కెటింగ్‌శాఖ ఏడీ పి.సత్యనారాయణచౌదరి ఆదేశించారు. మార్కెట్ ఫీజు వసూళ్ల అంశంపై జిల్లాలోని 9 మార్కెట్ కమిటీల సెక్రటరీలు, సూపర్‌వైజర్లతో అనంతపురం మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో బుధవారం ఆయన సమీక్షించారు. మార్చితో ముగిసిన 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.10.44 కోట్ల లక్ష్యం నిర్దేశించుకోగా 103 శాతంతో రూ.10.71 కోట్లు వసూలైందన్నారు. గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గం మినహా నిర్దేశిత లక్ష్యానికి వంద శాతానికి పైగా సాధించిన మిగిలిన ఐదు కమిటీల సిబ్బందిని అభినందించారు. ఇదే స్ఫూర్తిని ఈ ఆర్థిక సంవత్సరంలోనూ కొనసాగించాలన్నారు. అనంతపురం వ్యవసాయమార్కెట్‌యార్డులో చీనీ రైతులకు ఉపయోగపడేలా త్వరలో ఆధునిక ఓపెన్ షెడ్డు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. దుకాణాలు, గోదాముల అద్దెలు క్రమం తప్పకుండా వసూలు చేయాలని ఆదేశించారు.

క్లుప్తంగా

ఒలంపియాడ్‌లో ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

రాప్తాడురూరల్: అనంతపురం నగరం గుత్తిరోడ్డు, సంగమేష్‌నగర్‌లోని మాంటిస్సోరి పాఠశాలల విద్యార్థులు ఒలంపియాడ్ పరీక్షల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారు. యూనీఫైడ్ కౌన్సిల్ వారు దేశవ్యాప్తంగా 5 వేలకు పైగా పాఠశాలల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన వివిధ ఒలంపియాడ్ పరీక్షల్లో తమ విద్యార్థులు బంగారు పతకాలు సాధించి నేషనల్ అచీవర్స్‌గా గుర్తింపు పొందారని కరస్పాండెంట్ సి.సూర్యనారాయరెడ్డి తెలిపారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల కార్యదర్శి కె.మాధవి, ప్రిన్సిపాళ్లు ఎ.రమాదేవి, కె.పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ



6వ రోడ్డులో మైనార్టీ మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న అనంత చంద్రారెడ్డి

అనంతపురం క్రైం: రంజాన్‌ను పురస్కరించుకుని నగరంలోని 6వ రోడ్డులో బుధవారం వైఎస్సార్ సీపీ నాయకురాలు సల్మా ఆధ్వర్యంలో చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి పాల్గొన్నారు. సేవా దృక్పథం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రహంతుల్లా, నాయకులు నాగరాజు, తదితరులున్నారు.

లోకోస్ యాప్ నిర్వహణపై శిక్షణ

అనంతపురం: లోకోస్ యాప్ నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని డీఆర్‌డీఏ పీడీ ఐ. నరసింహా రెడ్డి ప్రారంభించారు. బుక్కరాయసముద్రం క్లస్టర్ నుంచి 6 మండలాలు, ఉరవకొండ క్లస్టర్ నుంచి 4 మండలాలు సిబ్బంది పాల్గొన్నారు. లోకోస్ యాప్ ఆవశ్యకత, బీపీఎం రోల్, సంఘం ప్రొఫైల్, సభ్యుల వివరాలు, గ్రామ సంఘం లావాదేవీలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ బి. ఈశ్వరయ్య , ఏపీఎం బి. అనిత పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ విజయమ్మ జన్మదినోత్సవం



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు

అనంతపురం క్రైం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాతృమూర్తి వైఎస్ విజయమ్మ పుట్టిన రోజును స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీదేవి, తదితరులు బుధవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, పార్టీ నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకురాళ్లు దేవి, పార్వతి, భారతి, రాధాయాదవ్, ఉష, శోభారాణి, శోభాబాయి, తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

చెన్నేకొత్తపల్లి: మండలంలోని బసినేపల్లిలో ఆత్మహత్య పాల్పడిన రైతు మురళీధర్‌రెడ్డి కుటుంబానికి రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రూ.50 వేలు ఆర్థికసాయం చేశారు. బుధవారం జెడ్పీటీసీ గోవిందరెడ్డి, ఎంపీపీ అంజలి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి మృతుని కుటుంబ సభ్యులకు ఆ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్నారెడ్డి, నాయకులు ఎస్‌టీడీ శ్రీనివాసరెడ్డి, సింగం హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న తోపుదుర్తి చందు

రాప్తాడు: ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని చిన్మయనగర్ 'మసీదు-ఈ-మావా' మసీదులో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, నాయకులు సాకే చంద్ర, పూజారి ఓలయ్య తదితరులు పాల్గొన్నారు.

సంతోష్‌నగర్‌లో..

రాప్తాడురూరల్: రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి అనంతపురం రూరల్ మండలం చిన్నంపల్లి పంచాయతీ సంతోష్‌నగర్‌లోని మసీదు వద్ద ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రాప్తాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పంచాయతీ నాయకులు ముప్పారపు వెంకటరాముడు, వడ్డే పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.



చీరకొంగు కప్పుకుని టవర్‌క్లాక్ సమీపంలో భిక్షాటన చేస్తున్న మహిళలు



రెండో రోడ్డులో చెట్ల కింద సేదతీరుతున్న ఆవులు

శాంతించు.. సూర్యదేవా..

సూర్యప్రతాపం పెరుగుతోంది. భానుడి భగలకు సామాన్యులు అల్లాడిపోతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు పశుపక్ష్యాదులను సైతం హడలెత్తిస్తున్నాయి. మండుటెండకు తిరగలేక బుధవారం రెండో రోడ్డులో చెట్ల కింద సేద తీరుతూ పశువులు కనిపించగా.. అదే సమయంలో సూర్యుడు సెగలు కక్కుతున్నా తమ బిడ్డలను ఎత్తుకుని భిక్షాటన చేస్తూ కొందరు మహిళలు కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

రహమత్‌నగర్ అభివృద్ధికి చర్యలు

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



రహమత్‌నగర్‌లో రంజాన్ తోఫా అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: రహమత్‌నగర్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని 16వ డివిజన్ కన్వీనర్ సీ సుకేష్ ఆధ్వర్యంలో జరిగిన రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రహమత్‌నగర్‌లో రోడ్లు, కాలువలు ఏర్పాటు చేశామన్నారు. అందరికీ అందుబాటులో అత్యాధునిక వసతులతో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని నెలకొల్పామన్నారు. డివిజన్ అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. పేద ప్రజలకు తోఫా అందజేసే కార్యక్రమాన్ని చేపట్టిన సుకేష్ బృందాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య,పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్ గౌడ్, కార్పొరేటర్లు ఇస్హాక్ , అబూసలేహ, నాయకులు వాసగిరి నాగ్, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా 'జగనన్నే మా భవిష్యత్'



రాప్తాడు: పాలచెర్లలో 'జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడు: 'ప్రజలంతా జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, సంక్షేమ పథకాలు కొనసాగాలని కోరుకుంటున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి పాలనతో మా నమ్మకం నువ్వే జగన్ అంటున్నారు' అని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచు బండి శ్రీనివాసులు, మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాలచెర్ల పంచాయతీలో బుధవారం కూడా జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని కొనసాగించారు. మండల వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలిసి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను పలకరించారు. టీడీపీ పాలనకు, జగనన్న పాలనకు మధ్య తేడాను వివరించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ చాకలి శంకరయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు రఘురామిరెడ్డి, డీలర్ జయప్ప, బిల్లే అభిలాష్, ఎర్రిస్వామి, పోతన్న తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

అనంతపురం సప్తగిరి సర్కిల్: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరమని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా 6వ రోజు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో కార్యక్రమం చేపట్టారు. ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, సెక్యూరిటీకి జాగ్రత్తల గురించి వివరించారు. ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. అపార్ట్‌మెంట్లలోని సెల్లార్లలో ఆటోమెటిక్ స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు క్షేమంగా బయటపడేందుకు సరైన ప్రణాళికలను ఏర్పాటు చేసుకుని వాటి ద్వారా సురక్షితంగా బయటపడాలన్నారు. ఆసుపత్రుల్లో పైకప్పునకు తాటాకు, గడ్డి వంటి వాటిని వాడకూడదన్నారు. ఆసుపత్రి నుంచి బయటకు వెళ్లే మార్గాలలో మెట్లు, తలుపుల వద్ద ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రదేశాలను ముందస్తుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సహాయ అధికారి అశ్వర్థ, సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ డాక్టర్ సౌజన్యకుమార్, సెక్యూరిటీ సూపర్‌వైజర్లు రసూల్, నాగరాజు, అగ్నిమాపక సిబ్బంది సంజీవరాయుడు, వెంకటరాముడు, జయరాముడు, వేణుగోపాల్, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కోసం సైకిల్ యాత్ర



సైకిల్ యాత్ర చేస్తున్న దివ్యాంగుడు ప్రసాద్‌కు నగదు అందజేస్తున్న ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది

కనగానపల్లి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ ఒక దివ్యాంగుడు ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకు చేపట్టిన సైకిల్ యాత్ర బుధవారం కనగానపల్లి చేరుకొంది. మూడు చక్రాల సైకిల్ (ట్రై సైకిల్) మీద యాత్ర చేపట్టిన దివ్యాంగుడు ఎన్. ప్రసాద్ స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి యాత్ర విశేషాలను తెలియజేశారు. రాష్ట్ర విభజన సందర్భంగా అప్పటి కేంద్ర ప్రభుత్వం ఏపీకి ప్రత్యేక హోదా కల్పిస్తామని, విశాఖలో రైల్వేజోన్ ఏర్పాటు చేయిస్తామని పార్లమెంట్ సాక్షిగా హామీ ఇచ్చారన్నారు. ఇప్పటి దాకా ఆ హామీలు నెరవేరలేదని చెప్పారు. రాష్ట్ర పౌరుడిగా రాష్ట్రానికి న్యాయం జరగాలనే యాత్ర చేపట్టానన్నారు. సైకిల్ యాత్ర నిరాటంకంగా కొనసాగిందుకు స్థానిక అధికారులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది దివ్యాంగునికి ఆర్థిక సాయం అందించి ప్రోత్సహించారని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



మాట్లాడుతున్న ఎస్కేయూ వీసీ రామకృష్ణా రెడ్డి

అనంతపురం: ఎస్కేయూ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంప్‌లో భాగంగా బుధవారం ఆకుతోటపల్లి గ్రామంలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కిమ్స్ సవీరా ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానవుని దేహంలో గుండె ప్రధానమైనది అన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఏ.మల్లిఖార్జున రెడ్డి, ఫార్మసీ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ పి. వెంకటరమణ, ఆకుతోటపల్లి మేజర్ పంచాయితీ సర్పంచ్ చిత్రా గురుప్రసాద్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి. మురళీధర్ రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి. సత్యసౌమ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



అసిస్టెంట్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతపురం సెంట్రల్: అనంతపురం డిపో గ్యారేజీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ యూనిటీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం డిపో అసిస్టెంట్ మేనేజర్ చంద్రశేఖర్ రెడ్డిని ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) నారాయణస్వామి డిపో గ్యారేజీ ఉద్యోగస్తులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, గతంలోనే ఆయనపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. దాదాపు ఏడు ప్రధాన సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఎన్ఎంయూఏ డిపో కార్యదర్శి రామాంజనేయులు, డిపో సంయుక్త కార్యదర్శి శ్రీనివాసులు, డిపో ట్రెజరర్ శ్రీరాములు, నాయకులు కుమారస్వామి, రామాంజనేయులు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి పరీక్షలు



కంటి పరీక్ష నిర్వహిస్తున్న వైద్యులు

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో బెంగళూర్ శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన వృద్ధులకు పరీక్షలు నిర్వహించి, 53 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. అనంతరం ప్రత్యేక బస్సులో వారిని బెంగళూరు తీసుకెళ్లారు. సర్పంచ్ వరలక్ష్మి మాట్లాడుతూ గతంలో వందలాది మందికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి సమస్య ఉన్న వారికి ఆపరేషన్లు చేయించి అద్దాలను కూడా ఉచితంగా పంపిణీ చేశామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎవరూ కంటి సమస్యలతో ఇబ్బంది పడకూడదనే ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఆపరేషన్లు చేయిస్తున్నట్లు తెలియజేశారు. డాక్టర్ దయాకర్,నాయకులు వన్నూరప్ప, డీలర్ రాజశేఖర్, ఓబీ టైలర్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమూర్తికి గుర్రం జాషువా పురస్కారం

అనంతపురం కల్చరల్: మహాబోధి సాహిత్య వేదిక ద్వారా సేవలందిస్తున్న దాసగాని కృష్ణమూర్తి గుర్రం జాషువా అవార్డుకు ఎంపికయ్యారు. తెనాలికి చెందిన పద్మభూషణ్ గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ సంస్థ వారు ఏటా విశిష్ట వ్యక్తులకందించే పురస్కారాన్ని ఈ ఏడాది జిల్లావాసి కృష్ణమూర్తికి అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 23న తెనాలిలో జరిగే పురస్కార ప్రదానోత్సవంలో సాహితీప్రముఖులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అవార్డునందుకుంటారు. కృష్ణమూర్తికి కేంద్రసాహిత్య అకాడమీ అవార్డుగ్రహీతలు రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, బండి నారాయణస్వామి, డాక్టర్ పతికి రమేష్ నారాయణ, డాక్టర్ గేయానంద్ తదితరులు అభినందనలు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

యథావిధిగా నీటి సరఫరా

అనంతపురం క్రైం: నగరంలో యథావిధిగా గురువారం నుంచి నీటి సరఫరా జరుగుతుందని ఎస్ఈ సతీష్‌చంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడారు. కూడేరు వద్ద ఏర్పడ్డ రెండు లీకేజీలకు మరమ్మతు పనులు పూర్తయినట్లు తెలిపారు. పంపింగ్ ప్రారంభించామని, గురువారం నుంచి నీటి సరఫరా సజావుగా జరుగుతుందని తెలిపారు.

కూలీల హాజరు శాతాన్ని పెంచండి

రాప్తాడు: ఉపాధి కూలీల హాజరు శాతాన్ని పెంచాలని ఎంపీడీఓ సాల్మన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మండలంలోని ప్రసన్నాయపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో కూలీలకు విరివిగా పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓలు రామకృష్ణారెడ్డి, సావిత్రి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపడాలి

అనంతపురం క్రైం: మసీదు, ఈద్గా పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. బుధవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. వివిధ ప్రాంతాల్లో గ్యాంగ్‌వర్క్ చేపట్టి, శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. చెత్త చెదారం ఎక్కడా కనిపించరాదని పేర్కొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

కనగానపల్లి: వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకొని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ పీ.వీ.రమణ తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

రాప్తాడు: ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే విద్యార్థులు కచ్చితంగా లక్ష్యాలను నిర్దేశించుకొని చదవాలని ఎస్‌వీఐటీ కళాశాల కరస్పాండెంట్ వీ.బీ.ఆర్. శర్మ అన్నారు. బుధవారం మండలంలోని హంపాపురం సమీపంలోని శ్రీవెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్‌వీఐటీ) ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ సూర్యశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈఈఈ విభాగం ఫైనల్ ఇయర్ విద్యార్థులకు మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఫేర్‌వెల్ పార్టీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆ కళాశాల చైర్మన్ క్రిష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రారెడ్డి, సీఈఓ ఆనంద్ కుమార్, కళాశాల ఈఈఈ విభాగపతి షేక్షావలి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

రామగిరి: మండలంలోని కొత్తగ్యాదికుంట గ్రామంలో స్వచ్ఛంద సంస్థ టింబక్ట్ కలెక్టివ్ ఆధ్వర్యంలో మహిళా శక్తి సొసైటీ సభ్యులకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. సమాజంలో మహిళలకు జరుగుతున్న అన్యాయాలు, బాల్యవివాహాలపై గ్రామస్తులకు వివరించారు. సమాజంలో మహిళల పాత్ర ఎలా ఉంది అనే దానిపై నాటక రూపాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో మహిళా శక్తి సొసైటీ అధ్యక్షురాలు వహీదా, సీఈఓలు కాంచన, చిట్టెక్క, తులసి, కవిత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక రంగస్వామి నగర్‌కు చెందిన పావని అనే ఇంటర్ విద్యార్థిని మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బాధిత కుటుంబ సభ్యులు బుధవారం త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు.

నిధులు సమకూర్చుకోవాలి

కనగానపల్లి: గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపట్టేందుకు స్థానికంగానే నిధులు సమకూర్చుకోవాలని డీఎల్‌డీపీఓ శివకుమారి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, పన్నుల సేకరణపై స్థానిక అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో చేస్తున్న పారిశుద్ధ్య పనులు, పన్ను వసూళ్లపై కార్యదర్శులతో చర్చించారు. సమావేశంలో ఈఓఆర్డీ అనిల్‌కుమారి, పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'ప్రచార భేరిని జయప్రదం చేయండి'

కనగానపల్లి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార భేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ, సీపీఎం మండల నాయకులు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే బుధవారం కనగానపల్లిలో ప్రచారం పోస్టర్లను విడుదల చేశారు. మండలంలో ఈ నెల 24, 25 తేదీల్లో ప్రచార భేరి యాత్ర ఉంటుందని, మండలంలోని వామపక్షాల నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజా సంఘాల నాయకులంతా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహదేవ, సీపీఎం మండల కార్యదర్శులు బాలరాజు, కదిరప్ప, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

జీతాలు సరిగా ఇవ్వాలి

అనంతపురం సెంట్రల్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా సెంట్రల్ గ్రాంట్ నుంచి జీతాలు మంజూరు చేయాలని నిర్ణయించడంతో జీతాల మంజూరులో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఐసీడీఎస్ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో లాగానే 010 పద్దు కింద నెలానెలా జీతాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని బుధవారం ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవిని ఆమె చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ మహిళా, శిశు సంక్షేమశాఖ ఉద్యోగుల అసోషియేషన్ నాయకులు సురేష్‌బాబు, గంగాధర్, గీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి



పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి

అనంతపురం క్రైం: కూడేరు వద్ద జరుగుతున్న పైప్ లైన్ లీకేజీ మరమ్మతు పనులను డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి బుధవారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలని ఇంజినీర్లను ఆయన ఆదేశించారు. త్వరితగతిన నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామని డిప్యూటీ మేయర్ పేర్కొన్నారు. ఆయన వెంట కార్పొరేటర్లు అబూసలేహ, బాబాఫకృద్దీన్, తదితరులున్నారు.

సీడీసీ ఇన్‌చార్జ్ డీన్‌గా రామ్‌గోపాల్



డాక్టర్ కే.రామ్‌గోపాల్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రెక్టార్, సీడీసీ డీన్ (కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్) ప్రొఫెసర్ ఏ.మల్లిఖార్జున రెడ్డి ఈ నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు సెలవుపై వెళ్లారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జ్ సీడీసీ డీన్‌గా ఫిజిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్, పాలిమర్ సైన్సెస్ విభాగాధిపతి, పీఆర్వో డాక్టర్ కే.రామ్‌గోపాల్‌ను నియామకం చేశారు. ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి ఉత్తర్వుల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

గిరిజనులకు న్యాయం చేయాలి



ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం క్రైం: బోయ, బెంతో ఒరియలను ఎస్టీ జాబితాలో చేర్చాలని చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకుని గిరిజనులకు న్యాయం చేసే విధంగా తమ విన్నపాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా శాఖ గౌరవాధ్యక్షులు ఎస్ బాలాజీ నాయక్, తదితరులు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి వినతి పత్రం అందజేశారు. అనంతరం శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి నగరంలోని ఆమె నివాసంలో నాయకులు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు అశ్వర్థ నాయక్, బాల నాయక్, రంగ్ల నాయక్, పరమేష్‌నాయక్, నరేష్‌నాయక్, సుగుణబాయి, ఈశ్వరిబాయి, శివమ్మ, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుక



ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ఎంపీడీఓ ఆఫీస్ ఆవరణలో బుధవారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగానే నాయకులు ముందుగా కేక్‌కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోవిందరెడ్డి, ఎంపీపీ మజ్జిగ అంజలి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు డోలా రామచంద్రారెడ్డి, సర్పంచులు ధనశ్రీ, ఓబులేసు, జయరాంరెడ్డి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు అంత్యక్రియలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐదు అనాథ మృతదేహాలకు బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక గుత్తి రోడ్డులోని హరిశ్చంద్ర ఘాట్‌లో హిందూ సాంప్రదాయం ప్రకారం కార్యక్రమాలు చేపట్టారు. అంత్యక్రియలకు సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయసాయికుమార్ మాతృమూర్తి రుక్మిణి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో విజయసాయికుమార్, ట్రస్ట్ సభ్యులు నారాయణనాయక్, రాజు, గోవిందు పాల్గొన్నారు.